క్లుప్తంగా

శిక్షణ శిబిరాలు ఉపయోగించుకోండి

అయిజ: పట్టణంలోని అంబ భవాని ఆలయంలో మంగళవారం నుంచి 45 రోజుల పాటు, ఉదయం 9 నుంచి 12:30 వరకు బాల సంస్కారం శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు హిందు ధర్మ పరిరక్షణ సమితి అయిజ విభాగం సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో మానవ విలువలు, సంస్కృతి, భగవద్గీతకు సంబంధించిన 100 శ్లోకాలు, యోగ, సూర్య నమస్కారాలు వీటిపై శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలను బాల సంస్కారం శిక్షణ శిబిరానికి పంపాలని కోరారు.

'రైతు నేస్తం' సద్వినియోగం చేసుకోండి

అయిజ: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు నిర్వహిస్తున్న 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు 'వేసవి దుక్కులు–ప్రాముఖ్యత' అనే అంశంపై రైతుల సందేహాలను నివృత్తి చేస్తారని, రైతులకు సలహాలు, సూచనలు చేస్తారని రైతు సంఘం మండల అధ్యక్షుడు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ధరూరు: మండలంలోని భీంపురం గ్రామానికి చెందిన రామిరెడ్డి(55)అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ధరూరు, కేటీదొడ్డి మండలాల పార్టీ అధ్యక్షులు డీఆర్ విజయ్‌కుమార్, ఉరుకుందు, హనుమంతు, భగీరథ, వంశీ తదితరులు ఉన్నారు.

నేడు మందకృష్ణ మాదిగ రాక

అయిజ: నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు మద్దతుగా మంగళవారం పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న కార్యకర్తల సమావేశానికి మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పోగుల రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహించేందుకు మందకృష్ణ మాదిగ రానున్నట్లు పేర్కొన్నారు.

అపరిశుభ్రంగా బోరింగ్‌పంపు



కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెంలోని మురికితో అపరిశుభ్రంగా ఉన్నా, శుభ్రం చేయకుండా అందులోనే బోరింగ్ మోటారును అమర్చారు. పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు చెప్పినా పట్టించుకోకుండా అమర్చడంతో మురికి కంపుతో ప్రజలకు రోగాలు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. బోరు పంపు నుంచి వచ్చిన నీటిని తాగడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా బోరింగ్ దగ్గర శుభ్రపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటో, బైక్ ఢీ : ఇద్దరికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు శివారులోని జాతీయ రహదారిపై ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో బైక్ నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. గత నెల 16వ తేదీన కర్నూల్ పట్టణం, ముజాఫర్ నగర్‌కు చెందిన షేక్ మహబూబ్ బాషా, షేక్షావల్లి ఆటోలో జడ్చర్ల నుంచి కర్నూల్‌కు వెళ్తున్నారు. ఇటిక్యాలపాడు శివారులోని జాతీయ రహదారిపై బెంగుళూర్ వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలవడంతో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం షేక్ మహబూబ్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

మాసశివరాత్రి పూజలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులోని వైరాలగుట్టపై వెలసిన శివాలయంలో సోమవారం మాసశివరాత్రి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శివుడికి అభిషేకం చేయడంతో పాటు భక్తులు భజన కీర్తనలు ఆలపించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, యాదిరెడ్డి, లక్ష్మారెడ్డి ఉన్నారు.

సమస్యల్లో అనుబంధ గ్రామాలు



చిప్పదొడ్డిలో రోడ్డుపై నిలిచిన మురుగు

- సీసీరోడ్లు, డ్రైయినేజీలు లేక ఇబ్బందులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



నేతువానిపల్లితండాలో సీసీ రోడ్డు లేక ఇబ్బందులు

మల్దకల్: గద్వాల నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని గ్రామ పంచాయతీలకు అనుబంధంగా ఉన్న గ్రామాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సీసీరోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీసీరోడ్లు ఉన్నా రోడ్లపై మురుగునీరు నిలిచిపోవడంతో ప్రతిరోజు ప్రజలు ఇబ్బందులు పడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నా వాటికి సొంత భవనాలు లేవు. రేషన్ షాపులు లేకపోవడంతో సుదూర గ్రామాలకు వెళ్లి రేషన్ బియ్యం తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు ఐదు అనుబంధ గ్రామాలున్నాయి. వాటిలో బూడిదపాడు, ఎద్దులగూడెం, నేతువానిపల్లి తండా, ఈదులపల్లి, చిప్పదొడ్డి గ్రామాలున్నాయి. ఆయా గ్రామాలలో సమస్యలు తాండవిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు సైతం పంచాయతీ గ్రామాలను సందర్శించి వెళ్తున్నారు తప్పా, అనుబంధ గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీరోడ్లకు డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నిలిచి బురదమయంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి శివారు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గద్వాల నియోజకవర్గంలో..

మండలం	గ్రామ పంచాయతీలు	అనుబంధ గ్రామాలు
మల్దకల్	25	5
గద్వాల	28	4
గట్టు	27	5
కేటీదొడ్డి	23	5
ధరూరు	28	8

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి



గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో చర్లగార్లపాడు గ్రామానికి వెవెళ్లి అక్కడ పౌష్టికాహారం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గర్భిణులు, బాలింతలు అక్కడికి వెళ్లి తీసుకురావడానికి ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి గ్రామంలోనే అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసి పౌష్టికాహారం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి.

– పరిమిత, ఎద్దులగూడెం

డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలి



సీసీరోడ్లు ఉన్నా డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగు రోడ్లపైనే పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. అనుబంధ గ్రామాలపై అధికారులు సవతి ప్రేమను చూపిస్తున్నారు. గ్రామాలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలి.

– రాఘవేందర్, చిప్పదొడ్డి

అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం ఏర్పాటు చేయాలి



గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. దీంతో అద్దె భవనానికి వచ్చి పౌష్టికాహారం తీసుకునేందుకు గర్భిణులు, బాలింతలు రోజూ ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలోనే సొంత భవనం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– నర్సింహులు, నేతువానిపల్లి తండా

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

పంచాయతీ అనుబంధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ఏయే గ్రామాల్లో సమస్యలున్నాయో వాటి నివేదికను ఉన్నతాధికారులకు పంపించి, నిధులు మంజూరైన వెంటనే సమస్యలు పరిష్కరిస్తాం.

– హరికృష్ణ, ఎంపీడీఓ, మల్దకల్

పేదల అభ్యున్నతే లక్ష్యం



పెద్దొడ్డిలో మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

మల్దకల్: పేదల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమ ని జెడ్పీచైర్‌పర్సన్ సరిత అన్నా రు. సోమవారం మండలంలోని పెద్దొడ్డి, మల్దకల్, మంగంపేట, అమరవాయి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలలో కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి వాటిని పార్టీలకతీతంగా అందించిన ఘనత దక్కిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఉద్యోగ అవకాశాలు, ప్రాజెక్టులు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వడం జరిగిందని, త్వరలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లకు రూ.5లక్షలు అమలు చేయనున్నట్లు వివరించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవిని అత్యధిక మెజార్టీతొ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ఆయా గ్రామాలలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను దగ్గరకు వెళ్లి ఓటు అభ్యర్థించారు కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌బాబు, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, గోపాల్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి

రాజోళి: ఆర్‌డీఎస్ కెనాల్‌లో జరుగుతున్న మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. మండలంతో పాటు ఆర్‌డీఎస్ పరిధిలోని పలు చోట్ల మరమ్మతు పనులు ప్రస్తుతం కొనసాగుతున్న నేపథ్యంలో వేగం పెంచాల్సిన అవసరముందని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం పనులకు అడ్డంకులు లేకుండా సాగిపోయే అవకాశముందని, రానున్న రోజుల్లో వర్షాలు కురిస్తే పనులకు అంతరాయంతో పాటు, రైతులకు నీరందించేందుకు పలు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. అధికారులు దాన్ని దృష్టిలో పెట్టుకుని పనులను వేగంగా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆర్థికఅక్షరాస్యతపై అవగాహన అవసరం



మద్దూరు: మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై మహిళా సాధికారత కేంద్ర ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని అమర్‌గడ్డ కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత ఆర్థిక నిపుణుడు విజయ్‌కుమార్ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను వివరించారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా, సురక్ష బీమా యోజన, సుకన్య సమృద్ధి యోజన, ఓపెన్ స్కూల్ తదితర వాటిని వివరిచారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే దేశం ఆర్థికంగా ఎదుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ మెంటర్ శ్రావణి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవా సమితి సభ్యులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మాతృశ్రీ ఈశ్వరాంబ డేను పురస్కరించుకుని ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. సోమవారం తెల్లవారు జామున అమ్మవారి చిత్రపటంతో పట్టణ పురవీధుల గుండా నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు, భక్తి పాటలను ఆలపించారు. బాబాకు తల్లి ప్రోత్సాహాన్ని వివరించారు. కార్యక్రమంలో కృష్ణమాచారి, మల్లికార్జున్, గోపినాథ్‌రావు, ఆనంద్‌చా రి, బీవీఎస్ రెడ్డి, శివరాజ్, మాధవరెడ్డి, విరూజ, సుగమ్మ, లలిత, రియా మాధురి పాల్గొన్నారు.

మూగ జీవాల రోదన..

- నిరుపయోగంగా నీటితొట్లు
- ఎండ తీవ్రతకు మూగజీవాలు విలవిల
- నీరులేక అల్లాడుతున్న వైనం
- మరమ్మతు చేయకపోవడంతో శిథిలావస్థకు..



చెన్నిపాడు చాలా రోజులుగా నెర్రలు పారిన నీటితొట్టి

మానవపాడు: నీటి కోసం మూగజీవాలు ఇబ్బందులు పడుతున్నాయి. గ్రామాల్లో మూగజీవాలకు నీటితొట్లను మరమ్మతు చేయపోవడంతో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం కనిపిస్తోంది. పశువులు, మేకలు, గొర్రెల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటితొట్లు మూలనపడ్డాయి. వాటి నిర్వహణ అధికారులు, పంచాయతీ పాలక వర్గాలు పట్టించుకోవడం లేదు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో నీటి తొట్లను రూ.20వేల ఉపాధి హామీ నిధులతో నిర్మించారు. నీటితొట్లలో పంచాయతీ అధికారులు నీటిని నింపాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. రోజు రోజుకు భానుడు ప్రతాపానికి భూగర్భజలాలు అడుగంటాయి. ఎక్కడ చూసినా చుక్కనీరు లేకపోవడంతో మూగజీవాలు ఆశగా నీటితొట్ల వైపు చూస్తున్నాయి. నిరుపయోగంగా ఉన్న వాటిని వినియోగంలోకి తేవడానికి అధికారులు దృష్టి పెట్టడం లేదు. వేసవి కారణంగా చెరువులు, కుంటలు, వాగులు, బావులతో పాటు చేతి పంపులు కూడా ఇంకిపోవడంతో మేతకు వెళ్లిన మూగజీవాలు గుక్కెడు నీటికోసం నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఒక వైపు ప్రజలు, మరో వైపు మూగ జీవాలు నీటికోసం విలవిలలాడుతున్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోని నీటితొట్లకు మరమ్మతు చేసి నీటిని నింపాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరాయి



మండలంలో గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు శిథిలావస్థకు చేరాయి. వాటికి వెంటనే మరమ్మతు చేపట్టి మూగజీవాలకు నీరు అందించాలి. చుక్కనీరు అందక పశువులు అల్లాడుతున్నాయి. ఇక్కనైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

– రవి, మానవపాడు

వినియోగంలోకి తీసుకురావాలి



గతంలో ఉన్న తొట్లు వినియోగంలోకి తీసుకురావడంతో పాటు కొత్తగా ప్రతి గ్రామ పంచాయతీలో రెండు నిర్మిస్తే చాలా ఉపయోగం. నీటితొట్ల నిండా తాగునీటిని ఏర్పాటు చేసే దిశగా అధికారులు చొరవ చూపాలి.

– చిన్న సంజీవనాయుడు, చెన్నిపాడు

చర్యలు తీసుకుంటాం



మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్మించిన పశువుల తొట్లు ఎక్కడ ఏ విధంగా ఉన్నాయో పరిశీలించి నివేదికలు తాయరు చేస్తాం. శిథిలావస్థకు చేరిన వాటిని మర్మతులు చేసేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. నీటి తొట్లు పశువులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటాం.

– అంజనేయులు, ఎంపీడీఓ, మానవపాడు

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయండి



కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరుతున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

అయిజ: పట్టణంలోని పాతబస్టాండ్–కొత్త బస్టాండ్‌ల మధ్య పెద్ద వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు వెంటనే పూర్తిచేయాలని అఖిలపక్ష కమిటీ నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయానికి బస్సులో వెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏఓ భద్రప్పకు వినతిపత్రం అందజేశారు. బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం కావడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పనులు వెంటనే పూర్తిచేయాలని కోరారు. అయిజ–పులికల్ రోడ్డు నిర్మాణం పనులు ఆలస్యమయ్యాయని, దానివల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, నిర్మాణం పనులు వెంటనే పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

14 నుంచి ఆరాధనోత్సవాలు



మల్దకల్‌లో మాట్లాడుతున్న ధీరేంద్రదాసు

మల్దకల్: మండల కేంద్రంలో ఈనెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు శేషదాసుల వారి 139 ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శేషదాసుల వారి వంశీయులు ధీరేంద్రదాసు తెలిపారు. ఈ ఆరాధనోత్సవాలకు సంబంధించి సోమవారం ఆలయ అవరణలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు ఆధ్వర్యంలో ధీరేంద్రదాసు, రమేషాచారిలు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. శేషదాసుల ఆరాధనోత్సవాలు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు వారు తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో రాఘవేంద్రదాస్, శేషగిరిరావు, శశాంక, విష్ణు, చంద్రశేఖర్‌రావు, అరవిందరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముమ్మర ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



పాగుంటలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఉపాధి కూలీలతో బీజేపీ నాయకులు

అయిజ: మండలంలోని ఉప్పలలో సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వుపై ఓటు వేసి నాగర్ కర్నూల్ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు నల్లన్న, కిరణ్ రెడ్డి, రాజశేఖర్ గౌడ్, పరుశరాం, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికలలో మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ బూత్ అధ్యక్షుడు ఆలూర్ కృష్ణకాంత్, తిమ్మప్పగౌడు బీజేపీ గెలుపు ఎవ్వరు ఆపలేరని అన్నారు. సోమవారం మండలంలోని పాగుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వీరేష్, రవి, సతీష్, రమేష్, మహిళలు ఉన్నారు.

గద్వాల రూరల్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీకే బంగ్లాలో ఇటిక్యాల మండలం నక్కలపల్లికి చెందిన తాజామాజీ సర్పంచు తదితరులు బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. వారికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మధు, శ్రీనివాసులు, విజయ్, ప్రభాకర్‌రెడ్డి, రవికుమార్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

గద్వాల రూరల్: జిల్లా కేంద్రంలోని 36వ వార్డుకు చెందిన యూత్ సభ్యులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, నాయకుడు తిరుపతయ్య కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మల్లు రవిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, కోటేష్, పరశు, తదితరులు ఉన్నారు.

ఉండవెల్లిలో ఈత కొడుతున్న చిన్నారులు



ఈతతో ఎండల నుంచి ఉపశమనం

మండలంలోని ఎండలు 45 డిగ్రీల పైనే ఉంటుంది. ఎండల తీవ్రతకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం చిన్నారులు, యువకులు ఒక నీటి తొట్టేలో నీరు ఉండడంతో సరదాగా ఈత పడుతున్నారు. ఉత్సాహంగా ఈత కొడుతున్న చిన్నారులు ఒక్కసారిగా ఎండల తీవ్రతకు ఊపిరి పీల్చుకుంటున్నారు.

– ఉండవెల్లి

అయిజలో పోలీస్ కవాతు



అయిజలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అయిజ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు మండల కేంద్రంలో సోమవారం ఎస్‌ఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఐటీబీపీ కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితిని కల్పిండంలో భాగంగా కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటీబీపీ కేంద్ర బృందం, పోలీసులు పాల్గొన్నారు.

గుంతలమయంగా ప్రధాన రోడ్లు



గుంతలమయంగా కంకర తేలిన రాజోళి-శాంతినగర్ రోడ్డు

రాజోళి: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లతో పాటు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కూడా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాజోళి–శాంతిగనర్ మధ్యలో బీటీ రోడ్డు పూర్తిగా వేయకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. బీటీ రోడ్డు రాజోళిలో మొదలై సరిహద్దు వరకే వేసి, వడ్డేపల్లి సరిహద్దు నుంచి రోడ్డు వేయకపోవడంతో గుంతల రోడ్డుపైనే ప్రయాణం తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఈ రోడ్డు వేయలేదని, కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో, ద్విచక్ర వాహనం సైతం ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంది. కంకర తేలి, మోకాళ్లలోతు గుంతలు ఏర్పడి ప్రమాదాలకు అడ్డాగా మారింది. త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.